# లోక విద్య ప్రపంచం

మాసపత్రిక

బులెటిన్ జూన్ 2012 సంపాదకుడు & ప్రచురణ కర్త : టి. నారాయణ రావు వెల. రూ. 2

## సమానత్వం కోసం మానవజాతి ప్రయాణంలో లోకవిద్య ఆవశ్యకత

మానవజాతి చరిత్ర సమస్తం పోరాటాల చరిత్ర. ప్రభుత్వయంత్రాంగం నుండి దోపిడి వ్యవస్థ నుండి సంపూర్ణ స్వాతంత్ర్య స్వేచ్ఛా జీవితం కోసం మానవుని ప్రయాణమే చరిత్ర అనే నానుడి 20వ శతాబ్దపు ప్రారంభంలోనే చైనా విప్లవోద్యమ నాయకుడు మావోసేటుంగ్ నిర్వచించాడని మనకందరికి తెలుసు. దీనిముందు శతాబ్దాలలోనే కారల్‌మార్క్స్ నాటి పారిశ్రామిక అభివృద్ధే మానవజాతి అభివృద్ధి అనే నాటి నేటి నమూనాలో పెట్టుబడి సేకరణ కేంద్రంగా మానవ శ్రమ దోపిడి పునాదిగా నిర్మాణమైన సమాజంలో పెట్టుబడి - మానవ శ్రమల మధ్య సంబంధాలు వినిమయ పద్ధతులోనే అంతర్లీనంగా ఉంటాయని నిర్వచించడం జరిగింది. ప్రస్తుత కొనుగోలు అమ్మకపు విధానంలో మానవ శ్రమకు అత్యంత హీనమైన విలువ కట్టడంతో పాటు తయారయిన వస్తువు ముచ్చటగా ప్యాకింగ్ చేసి రవాణా చేసి ఆకర్షణీయంగా అలంకరించి అమ్ముకునే మధ్యవర్తుల శ్రమకు అత్యంత హెచ్చు ఖరీదు చెల్లించడం నేటి సమాజంలో హద్దు, అదుపు లేకుండా ప్రభుత్వం మద్దతుతో నిరాఘటంగా సాగిపోతోంది. దీనిని సమూలంగా మార్చాలంటే పనిచేసే ప్రతి శ్రమజీవి, మనమంతా ఒక్కటై, కలిసివుంటే నూతన సమాజ నిర్మాణం, సమన్యాయం, దొరుకుతుంది. అందరికి సరైన విలువ లభిస్తుంది. ఈ అసమానతల నిర్మూలనలో 'ప్రపంచ కార్మికులారా ఏకం కండి పోయేదేమిలేదు బానిస సంకెళ్ళు తప్ప' అనే నానుడి పుట్టింది. నాటి పరిస్థితులు ముఖ్యంగా వ్యవసాయ దేశమైనటువంటి చైనా దోపిడి నిర్మూలనకు ప్రధాన సమస్యగా భూమిని గుర్తించటం జరిగింది. పాశ్చాత్య సమాజంలో పెట్టుబడిగా ఉన్న యంత్రాలమీద అజమాయిషీ సంపాదించటం ద్వారా, దోపిడి నిర్మూలన జరుగుతుందనే సిద్ధాంతం నుంచి పండించే భూమిమీద పనిచేసే ప్రతి ఒక్కరికి హక్కుద్వారానే దోపిడి నిర్మూలించవచ్చునని చైనాలో మావో సూత్రీకరించారు. దీనిని విశ్లేషిస్తూ మానవ శ్రమకు సరైన విలువ చెల్లించటం ద్వారానే మానవజాతి నూతన సమాజ నిర్మాణాన్ని ఆవిష్కరించటం, దానికోసం ప్రతీఒక్కరికి, తిండి, బట్ట, ఇళ్ళు లాంటి ప్రాథమిక అవసరాల నుండి వ్యక్తి స్వాతంత్రం, స్వేచ్ఛ, అన్వేషణ పరిశోధన, సమాజ శ్రేయస్సు, సమానత్వంకోసం రాజ్యాధికారం కోసం కృషి చేయాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత సమాచార విప్లవ యుగంలో పాలకుల వద్ద సమాచారంతో పాటు, ఆ వ్యవస్థపై నియంత్రణ కూడా ఉంది. ఉదాహరణకు ఆర్థిక, ఉత్పత్తి, వినిమయ, వ్యాపార గిడ్డంగుల సేవలు సమస్త సమాచారం ఉంది. ప్రస్తుత శాస్త్ర పరిశోధనలు కూడా వారి చెప్పుచేతల్లోనే ఉన్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే సమాచార వ్యవస్థ రంగంలోని పెట్టుబడే నేటి సమాజ దశదిశ నిర్దేశిస్తుంది. ఎవరైతే ఈరంగంలో ఉన్నవారికి కావలిసినవి సమకూరుస్తున్నారో ఆ ఉత్పత్తిదారులు మాత్రం దారిద్ర్యంలో మగ్గుతున్నారు. ఈ సాధనాల ద్వారా లాభాల వేటలో పాలు పంచుకుంటున్న వారందరూ అభివృద్ధి కావాలని శ్రమ జీవులందరు వెనుకబడినవారని, వారివృత్తులు వారి జీవనశైలి న్యూనతతో చూడటం నేటి రివాజుగా మారింది. అందుకే శ్రమజీవులకు అత్యంత హీనమైన ధరలను నిర్దేశిస్తూ సమాచార రంగం వారికి మాత్రం అత్యధిక మొత్తాలు చెల్లిస్తూ ఉండటం నేడు అందరం గమనిస్తున్నాం. ఎవరైతే లోకవిద్య ద్వారా పరంపరాగా వస్తున్న జ్ఞానంతో ఉత్పత్తి చేస్తున్నారో వారిలో స్త్రీలు, వెనుకబడిన జాతులు, దళితులు, గిరిజనులు అధిక సంఖ్యలో ఉన్నారు. వీరు గౌరవ ప్రదమైన జీవితం కోసం రేయింబవళ్ళు శ్రమించడం, ఆడపిల్లల భ్రూణహత్యలు, రైతుల ఆత్మహత్యలు, వృత్తి విద్యలో ఉన్న వలసలు వెరసి మానవ సమాజం నేడు అల్లాడుతూ ఉంది. దీని ఫలితాలే మహిళాసంఘాల, రైతు సంఘాల, వెనుకబడిన జాతుల, దళితులు, మరియు ఇతర ఉద్యమాలు ప్రస్తుత వ్యవస్థపై ఒక తిరుగుబాటుగా చూడాలి. వీరంతా నూతన విద్యావిధానంలోకి, జీవన విధానానికి ప్రస్తుతం వారు చేసిన ఉత్పత్తులకు శ్రమ విలువకు సరైన ధరలేకపోవడమే మూలకారణంగా చూడాలి. వీరంతా లోకవిద్యపై జీవిస్తున్నవారు. వీరంతా విడివిడిగా ఉద్యమిస్తే ప్రభుత్వ యంత్రాంగం క్రూరంగా అణిచివేస్తుంది. ప్రస్తుత నూతన జ్ఞాన విధానం, కేంద్రీకృత ప్రభుత్వ యంత్రాంగం, పెట్టుబడి సేకరణే ప్రధాన లక్ష్యం. పెద్ద ఎత్తున కారుచౌకగా యంత్రీకరణ ద్వారా ఉత్పత్తులు చిట్టచివరగా కేంద్రీకృత వ్యాపార రంగం మన జీవితాలనే మార్చివేసి అనేక యుగాల నుండి వస్తున్న మానవ సంబంధాలను తెంచివేసి గడిచిన రెండు, మూడు వందల సంవత్సరాల జ్ఞానమే సర్వమనే భావనతో సామాజిక పరంగా అవసరాలను తీర్చిదిద్దుతున్నారు. లోకవిద్య ద్వారా వచ్చిన వృత్తి విద్యలను పదవి పరంపరగా వచ్చిన జ్ఞానాన్ని మానవత్వపు విలువలను మంటగలపటంతో పాటు లాభాపేక్ష, పెట్టుబడి సేకరణే అభివృద్ధి లక్ష్యంగా దూసుకుపోతున్న అమానవీయ అభివృద్ధి నమూనాకే బానిసలవుతున్నారు. ఆఖరికి మన వృత్తి విద్యలపట్ల, శారీరక శ్రమపట్ల అందరూ చిన్న చూపు చూడటం జరుగుతోంది. ఈరోజు విలువల హరణకు పరిహారం కోరటం- మన భూములకు, మన జీవితాలకు ఆఖరికి మానవ ప్రాణాలకు అంతేగాక విద్యా, ఉద్యోగాలలో కేటాయించుకోవడం తాత్కాలిక ఉపశమనాలకే. వీటివల్ల మానవ విలువలకు, మానవ శ్రమ విలువకు, మానవ సంబంధాల విలువలకు యుగయుగాలుగా మనమిస్తున్న గౌరవం భ్రష్టుపడుతోంది. ఈ రోజు అభివృద్ధి కాముకులు, నూతన సమ సమాజ నిర్మాణం కోరేవారు, శారీరక శ్రమకు పరంపర జ్ఞానానికి స్థూలంగా చెప్పాలంటే లోకవిద్యను తద్వారా వికేంద్రీకరణకు ఆధారవైన స్థానిక ఉత్పత్తి, వినిమయాలకు ప్రాధాన్యం యివ్వటం ద్వారా సమానత్వంతో పాటు సౌభ్రాతత్వంతో కూడిన నూతన సమాజ నిర్మాణానికి దోహద పడతారు. ప్రధానంగా లోకవిద్య, చేతివృత్తులు, వృత్తి విద్యలతో జీవించేవారికి మాత్రమే గౌరవ ప్రదమైన స్థానం యిచ్చే నూతన సమాజంలో మాత్రమే దోపిడి నిర్మూలన సాధ్యపడుతుంది. దీనికోసం లోకవిధ్యాధర సమాజంలోనే పరిష్కారాలు దొరుకుతాయి. ఉత్పత్తిలోని శ్రమకు సరైన విలువ చెల్లించటం ద్వారా అన్ని వృత్తులవారికి సమానమైన గౌరవం యివ్వటం ద్వారా, స్థానిక సమస్యల పరిష్కారానికి మొత్తం గ్రామాలనే ఎటువంటి బేధాభిప్రాయం లేకుండా ఏకం చేయడంలోనే ఈ దోపిడి వ్యవస్థ నిర్మూలన జరుగుతుంది. దీనిలో భాగంగా "లోకవిద్య జనాందోళన" ఈ క్రింది ఎజెండాపై పోరాటాలకు కావలసిన నిర్మాణాన్ని చేయటానికి నిబద్ధతో కృషి చేస్తుంది.

1. ప్రతివ్యక్తికి తనకు నచ్చిన వృత్తిని లోకవిద్య ద్వారా సంప్రాప్తమైన జ్ఞానంతో జీవించే ప్రాథమిక హక్కు కోసం భారత రాజ్యాంగ సవరణ జరగాలి.
2. ప్రతి శ్రమ జీవికి, కుటుంబానికి ప్రాథమిక అవసరాలైన తిండి, బట్ట, ఇళ్ళు నిర్వహించటానికి సరిపోయే సొమ్ము చెల్లించే ఏర్పాట్లు జరగాలి.
3. ఏ ఒక్కరిని తమ పారంపర్య జ్ఞానాన్ని వదిలి ప్రస్తుత వ్యవస్థలో ఉత్పత్తికోసం వేతన జీవిగా మార్చే నిర్బంధ శిక్షణ కార్యక్రమాలను సంపూర్ణంగా వ్యతిరేకించాలి.
4. ప్రతి గ్రామంలోను కులమతాలకు అతీతంగా రాజకీయ పార్టీలకు అతీతంగా సమాజ పురోభివృద్ధికి లోక విద్యాధర జ్ఞాన సమాజ నిర్మాణంలో ప్రతిఒక్కరికి పాలుపంచుకునే ప్రణాళిక రచన కోసం గ్రామ సుపరిపాలనకు కృషిచేయ్యాలి.
5. పూర్తిగా ఏకగ్రీవంగా స్వచ్ఛందంగా గ్రామసభ తీర్మానించే వరకు ఏ భూమినిగాని, నీటి వనరులనుగాని, అడవినిగాని అభివృద్ధి పేరుతో సేకరణను పూర్తిగా వ్యతిరేకించాలి.
6. భూమికి పరిహారం చెల్లించే పద్ధతి గ్రామస్తులందరికి కనీసం మూడు తరాలకు సరిపడా నష్టాన్ని లెక్కించి సరిపోయే సొమ్ము చెల్లించాలి.

ప్రొ॥ కృష్ణరాజులుతో నారాయణరావు

## వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటుధర కల్పించాలని కారంచేడులో 14.6.2012 లోకవిద్య సాధికార సంఘటన బహిరంగ సభ

లోకవిద్య సాధికార సంఘటన (ఆం.ప్ర.) మే 24, 25 తేదీలలో చీరాల సదస్సు అనంతరం ప్రతీ నెలలో ఒక సమస్యపై వివిధ గ్రామాలలో సభలు జరపాలని కార్యవర్గం నిర్ణయించింది. జూన్ నెలలో చీరాల, పరుచురు డివిజన్‌లో కారంచేడు గ్రామంలో 14.6.2012న వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు రేటు కల్పించాలని బహిరంగ సభ నిర్వహించడం జరిగింది. దగ్గుబాటి చౌదరిగారి అధ్యక్షతన జరిగిన సభలో మాజీ సర్పంచ్ వూటుకూరి వెంకటేశ్వరరావు, బుచ్చిరాములు, డి. జయరాంరెడ్డి, కె. బుచ్చియ్య చౌదరి, కె.జె. రామారావు, ఇంజనీర్, రామనాదం, మాచర్ల మోహనరావు, నూతి లక్ష్మయ్య, రైతు కూలీ సంఘ నాయకులు యార్లగడ్డ అక్కయ్యలు ప్రసంగించారు.

వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో వుంది. గత 10 సం॥రాలుగా మనం వరిపంట ఒకే రకంసాగు చేస్తున్నాం. రైతు పంటచేతికొచ్చేటప్పటికి రేటు లేకపోవడం, అమ్మిన తరువాత రేట్లు పెరగడం వలన మధ్యదళారీలు లాభ పడ్తున్నారు. ఎరువులు, పురుగుమందుల వాడకం నియంత్రించాల్సిన అవసరం వుంది. పరిశోధన రంగం కుంటుపడింది. రైతు కుటుంబాలు తమ జీవనాన్ని గౌరవ ప్రదంగా జీవించగలిగేటట్లు రైతు కుటుంబాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలని దగ్గుబాటి చౌదరి అన్నారు.

విత్తనాలు కల్తీ, పురుగు మందుల కల్తీ, గిట్టుబాటు ధరలేదు. దేశంలో ప్రతీ ఒక్కరికి విలువ వుంది. రైతులు కిడ్నీలు అమ్ముకుంటున్నారు. ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. పంట భూములను అభివృద్ధి పేరుతో కారు చౌకగా పారిశ్రామిక వేత్తలకు దారపోసి రైతుల ప్రయోజనాలు దెబ్బ తీస్తున్నారని రైతులు ఐక్యంగా కలిసి పోరాడాల్సిన అవసరముందని వూటుకూరి వెంకటేశ్వరరావు అన్నారు.

విత్తనాలకు మార్కెట్ పై ఆధారపడడం కాక మనకు కావల్సిన విత్తనాలు మనమే తయారు చేసుకోవడం, ఎరువులు, పురుగుమందుల వాడకం ఎకరానికి డి.ఎ.పి ఒక బస్తా యూరియా 2 బస్తాలు పొటాష్-1 బస్తాకు మించి వేయకూడదని కోరారు. వీటివాడకంలో కూడా ఎగువ ప్రాంతాల వారు అధిక నీరు వాడకం చివరి భూములకు నీరందకపోవడం వంటి సమస్యలున్నాయని రైతులు ఐక్యమై ముందుకు రావాలని బుచ్చిరాములు కోరారు.

వ్యవసాయంలో అనుభవజ్ఞులు రామనాధం మాట్లాడుతూ రైతులు ప్రధానంగా మార్కెటింగ్‌లో నష్టపోతున్నారని, రైతులలో ఐక్యతలేదని, రైతులు ఐక్యంగా ముందుకు రావాలని గిట్టుబాటు రేటు కొరకై ఆందోళన చేయాలని రామనాధం కోరారు.

స్వామినాధన్ కమిటీ రైతుల కుటుంబ అవసరాలతో కలిపి క్వింటాల్‌కు 2050/- రూ. ఇవ్వాలని సిపార్సు చేసిందని తక్కువ ఖర్చుతో దిగుబడి పెరిగేందుకు రైతులలో అనుభవజ్ఞుల సలహాలు తీసుకోవాలని ఎవరో వస్తారని ఎదురు చూడకుండా రైతులంతా ఐక్యమై పోరాడాలని జాగర్లమూడి అంజిబాబు అన్నారు.

దేశంలో హరితవిప్లవం పేరుతో ప్రవేశపెట్టబడిన విధానాలు రైతులను మార్కెట్ పరిధిలోకి తెచ్చాయని ఎక్కువ భూమి కలిగిన పెద్ద రైతులు లాభపడ్డారని, చిన్న మధ్యతరగతి రైతులు ఎక్కువగా నష్టపోయారని పేర్కొన్నారు. 2007లో అర్జున్‌సేన్ కమిటీ సరాసరి నెలకు రైతులకు వచ్చే ఆదాయం 2115 రూ॥లుగా వుంటే ఖర్చు రూ. 2770/- చేస్తున్నారని పేర్కొన్నదని, గిట్టుబాటురేటు నిర్ణయించేటపుడు విత్తనాలు, ఎరువులు రసాయనిక ఎరువులు 45 శాతం, కూలీల ఖర్చు 24 శాతం, నీటిఖర్చు, కౌలురేటు, పెట్టుబడిపై వడ్డీ 3 శాతం అవుతుందని, విద్య, వైద్యం ప్రయివేటీకరణ వలన రైతుల ఖర్చులను దృష్టిలో పెట్టుకుని గిట్టుబాటు రేటు నిర్ణయించాలని కె.జె. రామారావు పేర్కొన్నారు.

ఈనాడు రైతులు వివిధ పార్టీల మధ్య చీలిపోయారని, రైతులు మధ్య ఐక్యత లేదని అధికార ప్రతిపక్ష పార్టీలు రైతులు ప్రయోజనం గూర్చి ఆలోచించడం లేదని, ఎన్నికల సమయంలో ఎవరు ఏ పార్టీకి ఓటు వేసినా రైతు సమస్యలపై అందరూ ఒక్కతాటిపైకి రావాలని, రైతులు ఐక్యమయి ఒక శక్తిగా పోరాడితే గిట్టుబాటు రేటు సాధించగలరని పేర్కొన్నారు.

పారిశ్రామిక వస్తువుల ధరల నిర్ణయంలో అనుసరించినట్లుగా వ్యవసాయోత్పత్తుల ధరలు ఎందుకు నిర్ణయించరని ప్రశ్నించారు వ్యవసాయోత్పత్తుల ధరల నిర్ణయంలో రైతు ప్రతినిధుల భాగస్వామ్యం లేకపోవడం వలన నష్టం జరుగుతోందని ఉద్యోగులు, జీతాలు 150 శాతం, ప్రజాప్రతినిధులు ఎం.ఎల్.ఎ.లు ఎం.పి.ల జీతాలు 500 శాతం, శుద్ధిచేసిన ఆహారపదార్థాల ధరలు 300-600 శాతం పెరిగాయని, వ్యవసాయోత్పత్తుల ధరలు మాత్రమే నిలకడగా వున్నాయని, ఈ వివక్షతను ప్రశ్నించాలని, రైతులు ఒక శక్తిగా ముందుకు వచ్చి మన అవసరాలు, ఖర్చులు అన్నీ కలిపి గిట్టుబాటు రేటుని మనమే నిర్ణయించడం చేయాలన్నారు. దేశంలో 25 పంటలకు గిట్టుబాటు రేటు నిర్ణయిస్తే 2 పంటలు వరి, గోదుమకు మాత్రమే మార్కెట్ సహకారం వుందని, రైతులు ఐక్యమై గిట్టుబాటు రేటు కొరకు ఉద్యమించాలని పేర్కొన్నారు.

నూతి లక్ష్మయ్య, రైతుకూలీ సంఘనాయకులు మాట్లాడుతూ రైతుల సమస్యలపై పోరాటంలో తమ వంతు పాత్ర నిర్వహిస్తామని తెలియజేసారు.

1990-91 నుండి ప్రవేశపెట్టిన ఆర్థిక సంస్కరణల వలన దేశంలో పత్తి రైతులు ఆత్మహత్యలు పెరిగాయని, పత్తిరైతుల సమస్యలపై యలమంచలి శివాజీ గారిని పిలిచి రైతులకు శిక్షణా తరగతులు నిర్వహించారని, గిట్టుబాటు రేటు కొరకు దేశ వ్యాప్తంగా పంజాబ్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లలో రైతాంగ ఉద్యమాలు చేసారని, ఈనాడు మోన్‌సాంటో, బేయర్ వంటిపెద్ద కంపెనీలు విత్తనాలు, ఎరువుల రేట్లు పెంచి వేసాయని, వ్యవసాయ కాలేజీలలో పరిశోధన కుంటుపడిందని విదేశీ కంపెనీలకు అనుకూలంగా విధానాలు రూపుదిద్దుకొంటున్నాయని కారంచేడు రైతులు వ్యవసాయం చేయడంలో అందెవేసినవారని, రైతుల సంక్షోభంపై కారంచేడు రైతులే ముందు పీఠీన నిలచి పోరాడాలని మాచర్ల మోహనరావు కోరారు.

జయరాంరెడ్డి, కారంచేడు రైతునాయకులు యార్లగడ్డ అక్కయ్య పాల్గొన్నారు. కారంచేడు గ్రామంలో 400 మంది రైతులు హాజరై సభను విజయవంతం చేసారు.

**- లోకవిద్య ప్రతినిధి-కారంచేడు**

# మే 24, 25 తేదీలలో చీరాల - జాండ్రపేట బి.వి & బి.హెచ్. హైస్కూల్లో జయప్రదంగా జరిగిన లోకవిద్యా ఆందోళన సదస్సు

24వ తేదీ ప్రారంభ సభలో చేనేత నాయకులు గొర్రె నాగలింగం అధ్యక్షతన జరిగిన సదస్సులో లోకవిద్య అవగాహనపై పొ॥ క్రిష్ణరాజులు మాట్లాడుతూ అభివృద్ధి పేరుతో వేలకోట్ల రూ॥ల ప్రాజెక్టులు వస్తున్నాయి. సెజ్‌లు, ధర్మల్ కేంద్రాలు, అణువిద్యుత్ కర్మాగారాలు... శ్రీకాకుళం జిల్లా కొవ్వాడ దగ్గర అణువిద్యుత్ కర్మాగారం తమిళనాడులో కూడంకుళంలో అణువిద్యుత్ కర్మాగారాలు వస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ సోంపేటలో ధర్మల్ విద్యుత్ కర్మాగారానికి వ్యతిరేకంగా ప్రజలు పెద్ద ఎత్తున నిరసన తెలియజేస్తే కాల్పులు జరిపారు. కూడంకుళంలో 70 వేలమంది ప్రజలు పెద్ద ఉద్యమం చేస్తున్నారు. మత్స్యకారుల ఉపాధిపోయింది. ఆరువేల మంది ప్రజలను జైళ్ళలో వేసారు. కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం, ఎ.ఐ.డి.యం.కె., డి.ఎమ్.కె., సి.పి.ఐ. పార్టీలు అణువిద్యుత్ కేంద్రాన్ని సమర్థిస్తున్నాయి. 1990లో మొదలైన అభివృద్ధి ప్రక్రియకు రెండు ముఖాలున్నాయి. వృత్తులు నాశనమవుతున్నాయి. బతుకు తెరువు ఆధారమైన జ్ఞానం నాశనమైంది. పిల్లలు వంశపారంపర్యంగా వున్న వృత్తులను చేయడంలేదు. చదువుకొన్నా ఉద్యోగాలు లేవు. పనిచేసే జ్ఞానం వదిలివేసాం.

సోంపేటలో ఉద్యోగాలు ఇస్తాం అన్నారు. వాచ్‌మెన్‌లాంటి నైపుణ్యంలేనివి మాత్రమే ఇచ్చారు. మన దగ్గరవున్న జ్ఞానం వదిలివేసి గులాంగిరిలో పడిపోయాం. ఎంత పెద్ద ఆందోళననైన చేయండి. నష్టం పరిహారం ఇస్తారు. మధ్యప్రదేశ్‌లో లక్ష కోట్ల ప్రాజెక్టు వచ్చింది. ఎకరంకు 80 వేలు నష్టపరిహారం ఇస్తామన్నారు. 2 లక్షలు అడిగారు. దానికి అంగీకరించారు. భారతీయ కిసాన్ యూనియన్ ఎకరంకు 20 లక్షలు డిమాండ్ చేసింది. భూమి కోల్పోవడం అంటే జీవితం కోల్పోవడం. కుటుంబం, పిల్లలు, పెద్దలు అందరి జీవితాలకి గ్యారంటీ ఇవ్వాలి. జీవితాన్ని తిరిగి ఇవ్వలేదు. లోకవిద్య ఆధారంగా మనవృత్తుల్ని నమ్ముకొని మన జ్ఞానంపై ఆధారపడి ఒకరికొకరు మద్దతుగా కలిసి జీవిద్దాం. ఏ అభివృద్ధి నమూనా అయినా మన జ్ఞానం నశించే విధంగా వుండకూడదు.

అనంతరం నారాయణరావు, ఎడిటర్ లోకవిద్య ప్రపంచం మాట్లాడుతూ దేశంలో వాల్‌మార్ట్‌లాంటి సంస్థల ప్రవేశంతో రైతుల నుండి, ముడి సరుకులు తక్కువ ధరలకు కొనుగోలు చేస్తారని, చిల్లర దుకాణదారులు మూతపడి ఉపాధి కోల్పోతారని, దేశవ్యాప్తంగా లక్షలాది కుటుంబాలు పెద్ద పెద్ద మాల్స్ వలన ఉపాధి కోల్పోతారని, రైతులు, చిల్లర దుకాణాదారులు, వృత్తిదారులు, సంఘటితమై రాబోయే ముప్పును ఎదిరించాలని లోకవిద్య ఆధారంగా వృత్తులపై ఆధారపడే అభివృద్ధి విధానం వైపు ఆలోచించాలని కోరారు.

పర్యావరణ పరిరక్షణ సమితి నాయకులు ఢిల్లీ రావు మాట్లాడుతూ సోంపేటలో మేంకూడా చాలాకాలం రాజకీయ మత్తులో, నిషాలో అభివృద్ధి భ్రమల మధ్యే బతికాం. కానీ పరవాడ విద్యుత్ కేంద్రం మొదలైన తర్వాత జరిగిన విధ్వంసం కళ్ళారా చూసి మన కాళ్ళకింద భూమి నిలవదని అర్థమైంది. ప్రారంభంలో ముగ్గురు, నలుగురితో మొదలైంది. బాలగోపాల్ లాంటి మేధావులు ఊరూరు తిరిగి ఈ అభివృద్ధి వెనకాల విధ్వంసం దాగివుంది అని మైకులలో చెప్పినా పట్టించుకోలేదు. పరవాడ అనుభవాలు సి.డి.లో చేసి, ఊరూరా ప్రదర్శిస్తే ప్రజలు మేల్కొన్నారు. ఎన్.సి.సి. వాళ్ళు ఆరోగ్య క్యాంపులు పెట్టారు. డా॥ క్రిష్టమూర్తి, న్యాయవాదులు, రైతులు, మత్సకారులు, ముఖ్యంగా స్త్రీలు కదలడంతో ఉద్యమానికి ఊపువచ్చింది. డాక్టర్లు, ఉపాధ్యాయులను బదిలి చేసారు. వ్యాపారస్తులపై ఇన్ కంటాక్స్ దాడులు చేసారు. రైతులకు నీరు వదలకపోవడం, నోరుగలవాళ్ళందరికి జీతాలు ఇచ్చి కొనేసారు. పత్రికలవారికి మోటారు సైకిళ్ళు, ల్యాప్‌టాప్‌లు ఇచ్చారు. ఎన్ని ఇబ్బందులు పెట్టిన స్త్రీలు, ముసలివారు పిల్లలకు అనేకమంది లాఠీ దెబ్బలు తిని గాయపడినా ఒక్క తాటిపై నిలిచి ఆందోళన చేసారు. కృష్ణరాజులు, నారాయణరావు చెప్పినట్లు మనం మనవృత్తులు వదిలివేసి ఎండమావులకోసం పరిగెత్తుతున్నాం. అభివృద్ధి క్రమం ప్రజలకు కాదు కొద్దిమంది పెట్టుబడిదారులకే. మీలాంటి మేధావులు ముందుకొచ్చి ప్రజలకు అండగా నిలచి దేశాన్ని బాగుచేయాలని కోరారు.

అనంతరం 2వ సెషన్‌లో చిన్న నీటిపారుల, రైతుల సమస్యలపై కె.జె.రామారావు ఉపన్యసించారు. రాష్ట్రంలో వ్యవసాయం గిట్టుబాటుకాక రైతులు సంక్షోభంలో వున్నారు. వ్యవసాయ ఖర్చులు పెరిగి గిట్టుబాటురేటు రాక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతుంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు.

గల 10 సం॥లలో (2001-11) వ్యవసాయోత్పత్తుల ధరలు 25 శాతం పెరిగితే ఇనుము, సిమెంట్, శుద్ధి చేసిన ఆహార పదార్థాల ధరలు 300-600 రెట్లు పెరిగాయి. ఇదేకాలంలో దేశంలో ఉద్యోగుల జీతాలు 150 శాతం పెరిగాయి. (6వ పే కమీషన్ పెరుగుదలకాక) ప్రజాప్రతినిధులు ఎం.ఎల్.ఏలు వేతనాలు 500 శాతం పెరిగాయి. అసంఘటిత రంగంపై కేంద్రప్రభుత్వం నియమించిన అర్జున్‌సేన్ గుప్తా కమిటీ దేశంలో సరాసరి రైతుల ఆదాయం నెలకు రూ. 2115/- అయితే ఖర్చు 2770 రూ॥లు అవుతుందని చిన్న, మధ్య తరహా రైతుల ఆదాయం 1880 రూ॥లు అయితే ఖర్చు 2678 రూ. అవుతోందని పేర్కొన్నారు. దీనికి ప్రధానకారణం వ్యవసాయ ఉత్పత్తుల ధరలు అయిన ఖర్చులు, రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకోకుండా నిర్ణయించడం, పెరుగుతున్న ధరలతో ఖర్చులు పెరగడం, వ్యవసాయ ఉత్పత్తుల కనీస ధరలు 25 రకాల ఆహార పదార్థాలకు నిర్ణయించినా మార్కెట్ జోక్యం మాత్రం ధాన్యం, గోదుమలకు మాత్రమే వర్తించడం మిగిలిన వాటిని మార్కెట్ దయాదక్షిణ్యాలకు వదిలివేస్తున్నారు.

2009-10లో గోడౌన్లనిండా ధాన్యం నిల్వలు నిండిపోవడంతో ప్రభుత్వం కొనుగోలు చేయలేదు. 2010-11లో ప్రభుత్వం 4.7 లక్షల టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేసింది.

వ్యవసాయ ఉత్పత్తుల కనీస ధరను నిర్ణయించేందుకు ఒక సం॥ క్రితం ఖర్చులను లెక్కలోకి తీసుకోవడం, దేశ వ్యాప్తంగా సమాచార సేకరణ జరిపే పీల్ట్ అసిస్టెంట్లు పోస్టులు ఖాళీలున్నాయి. ఆంధ్రప్రదేశ్ 60 మందికి 25 మంది పీల్డ్ అసిస్టెంట్లు మాత్రమే ఉన్నారు. కనీస ధరల నిర్ణయాలు రైతుల ప్రమేయం లేదు. బ్యూరాక్రసీ, బహుళజాతి సంస్థల ఏజంట్లు, రైతుల ప్రయోజనాలకు వ్యతిరేకంగా ఉండే వారితో వ్యవసాయ ధరల కమిటీ నిండి వుంది.

పారిశ్రామిక వస్తువుల ధరలు ఇనుము, సిమెంట్ వంటివి ఉత్పత్తి ఖర్చులు, జీతాలు, టాక్సులు అన్ని కలిపి నిర్ణయిస్తారు. కానీ వ్యవసాయోత్పత్తుల ధరల నిర్ణయంలో పెట్టుబడి, వడ్డీ, విత్తనాలు, ఎరువులు, రైతు శ్రమ, కూలీల ఖర్చు, ప్రయాణ ఖర్చులు, కుటుంబ ఆరోగ్య ఖర్చులు కలిపి నిర్ణయించడం లేదు. కౌలు రైతులకు ఋణాలు ఇవ్వకపోవడం, భూమికి ఇచ్చే అద్దెను కూడా ఖర్చులలో కలపాల్సివుంది. ఉపాధి హామీ పథకం అమలు ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలుచేయడం లేదు. ఇది రైతులకు సీజన్‌లో కూలీల కొరతను సృష్టిస్తోంది. కూలీలను సోమరిపోతులను చేయడమేగాక మద్యానికి బానిసలను చేయడం ద్వారా గ్రామీణ ప్రాంతంలో వరికోత యంత్రాలు లేకుండా కోతలు పూర్తి చేయలేని పరిస్థితి వుంది. పట్టణ ప్రాంతాలపై మోజుతో అనేకమంది వలసలు పెరిగాయి. ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానంపై ఏ రాజకీయ పార్టీ స్పదించడం లేదు. ఏ పార్టీ అధికారంలో వున్న అదేవిధానంను అనుసరిస్తున్నారు. రైతులు వివిధ పార్టీల మధ్య చీలి అనైక్యంగా వున్నారు. రైతు ప్రయోజనాలకై రైతులు అంతా సమిష్టిగా ఒకతాటిపైకిరాకుండా ప్రస్తుత పరిస్థితులలో మార్పు సాధ్యం కాదని పేర్కొన్నారు.

చిన్ననీటి పారుదల అభివృద్ధి-కరువుపై కె.జె. రామారావు మాట్లాడుతూ రాష్ట్రంలో కరువు పరిస్థితికి ప్రధానకారణం అభివృద్ధి క్రమంలో జరుగుతున్న విధ్వంసం వలననే భూగర్భజలాలు తగ్గిపోతున్నాయని, సహజ వనరులైన ఇసకను నిబంధనాలకు విరుద్ధంగా తవ్వడం వలన భూగర్భ జలాలు తగ్గిపోతున్నాయని, హైదరాబాద్ చుట్టుపక్కల ఔటర్ రింగ్ రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం, ఇంజనీరింగ్ కాలేజీలు రావడంతో రంగారెడ్డి జిల్లాలోని చెరువులు తాటిచెట్టు లోతులో కందకాలు పెట్టి మట్టి తరలించుకు వెళ్ళారు. అంతేగాక వాగులలో, నదులలో ఇసుక తవ్వకాలు నిబంధనలు పక్కనపెట్టి ఇటాచీలు పెట్టి తవ్వి తరలించడంతో పర్యావరణ ప్రభావితమై వర్షాలు లేక క్షామ పరిస్థితులు సంభవించాయి. అభివృద్ధి పేరుతో కృత్రిమ కరువును సృష్టిస్తూ పర్యావరణ విధ్వంసం చేస్తున్న పాలకుల విధానాలను ప్రజలు వ్యతిరేకించాల్సిన అవసరముంది. చిన్న నీటి చెరువులు నదీ గర్భాలు పరిమితులకు మించి తవ్వకాలు జరపకుండా ప్రజలే ముందుకు వచ్చి నిరోదించాలని పేర్కొన్నారు.

మధ్యాహ్నం లంచ్ అనంతరం జయరాంరెడ్డి అధ్యక్షతన దళిత బహుజన దృక్పంథంపై దుర్గం సుబ్బారావు మాట్లాడుతూ దేశంలో సంక్షోభం సునామీలాగా అన్ని వర్గాలను చుట్టేస్తున్నది. అభివృద్ధి పేరుతో అనుసరిస్తున్న విధానాలు షెడ్యూల్డ్ కులాలు, తెగలు, వెనుకబడిన కులాల వృత్తులు చేసుకొనివ్వకుండా నాశనం చేస్తూ ప్రజల్ని కూలీలుగా మార్చుతున్నారని తీరప్రాంతాలలో ఓడరేవులు, విద్యుత్ కేంద్రాలు మత్సకారులు ఉపాధి కోల్పోతున్నారని సెజ్‌ల పేరుతో ఆధునిక యంత్రాలను తెచ్చి చేనేత వృత్తిని దెబ్బతీస్తున్నారని, యస్.సి., యస్.టి., బి.సి. కులాల వారు తమ వృత్తి రక్షణకు ఉద్యమించాల్సిన అవసరముందని పేర్కొన్నారు.

రెండోరోజు బహిరంగ సభకు నిషేదాజ్ఞలు విధించడంతో 24.5.2012న చీరాల జాండ్రపేట సెంటర్‌లో బహిరంగ సభ జరిగింది.జయరామరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో పొ॥ క్రిష్ణరాజులు లోకవిద్య దృక్పథం గూర్చి నారాయణరావు పెద్ద పెద్ద సూపర్‌బజార్‌ల వలన చిన్న వ్యాపారులు దెబ్బతినే ప్రమాదాన్ని ఉదాహరణతో వివరించారు. కె.జె. రామారావు, దుర్గం సుబ్బారావు, బాలసుబ్రహ్మణ్యం గారు సదస్సు ఏర్పాటుకు దారితీసిన పరిస్థితులపై, వివిధ వర్గాల ప్రతినిధులతో జరుగుతున్న సదస్సు గూర్చి వివరించడం జరిగింది.

25.5.2012న రెండో రోజు సదస్సుకు జయరాంరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో యానాది సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాలకొండయ్య యానాదుల సమస్యలపై వివరిస్తూ ఇలా పేర్కొన్నారు. దేశంలో 540 నుండి 600 గిరిజన తెగలున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 35 గిరిజన తెగలున్నాయి. యానాదిలో కప్పల యానాది, రెడ్డి యానాది 4 కులాలున్నాయి. ఈ గిరిజనేతరులను ఎస్.టి.లలో చేర్చడానికి 10 స్వభావాలున్నాయని జాతీయ ఎస్.టి. కమీషన్‌కు అప్పీల్ చేయాలి. షెడ్యూల్డ్ ప్రాంతాలలో 38 లక్షలు, మైదాన ప్రాంతాలలో 30 లక్షల ఎస్.టి. జనాభా వుంది. కేవలం 19 మంది ఎం.ఎల్.ఎలు మాత్రవే ఉన్నారు. సామాజిక న్యాయప్రకారం 68 లక్షల జనాభాకు 34 మంది ఎం.ఎల్.ఎలు వుండాలి. షెడ్యూల్డ్ ఏరియాలో భూములు గిరిజనేతరులకు చెందరాదు. అయినా గిరిజన ప్రాంతాలలో భూములు గిరిజనేతరుల స్వాధీనంలోకి వెళ్ళిపోయాయి. చీరాల ప్రాంతంలో యానాదులు 17 లక్షల జనాభా వున్నారు. పందుల పెంపకం యానాదులు చేస్తారు. మాకు రక్షణ లేదు, మెదడువాపు వ్యాధి వలన పందులను చంపేసారు. ఎరుకల, యానాది వారు ఉపాధి కోల్పోయారు. మా హక్కుల రక్షణ గూర్చి ఆలోచించలేదు.

ఆగస్టు 9 ఆదివాసీ హక్కుల దినంగా యానాది, ఎరుకల, లంబాడీ, సుగాలీలు లోకవిద్యతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా వున్నాం. మా హక్కుల రక్షణకు పోరాటం లేకుండా సాధ్యంకాదని చెప్పారు.

2వ సెషన్‌లో కె.జె. రామారావు అధ్యక్షతన జరిగిన సభలో అణువిద్యుత్ ప్రాజెక్టు నిర్మాణం పర్యావరణానికి ప్రమాదం గూర్చి విశ్రాంత ఐ.ఐ.సి.టి సైంటిస్టు డా. బాబురావు మాట్లాడుతూ నాగరిక ప్రపంచంలో వనరుల కొరత వుంది. మన వద్ద తగినన్ని బొగ్గు, చమురు, గ్యాస్ నిల్వలు మన అవసరాలకు సరిపడా లేవు. అభివృద్ధి చెందిన దేశాలు అమెరికా, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్‌లు పేద దేశాలను దోచుకుని ఆ సంపదలతో విలాస జీవితాలు అనుభవిస్తున్నారు. వారిని చూసి మనంకూడా విలాస జీవితం కావాలంటే ఎలా మనకున్న పరిమిత వనరులతోనే జీవించాలి. ఆఫ్ఘనిస్తాన్, ఇరాక్‌ల ఆక్రమణ ద్వారా అమెరికా 15 ట్రిలియన్ డాలర్ల అప్పులో వుంది.

అమెరికాలో అణువిద్యుత్ కర్మాగారాలు క్షేమంకాదని మూసివేస్తున్నారు. జర్మనీ, బ్రిటన్, ఆస్టేలియాలు పుకుషియా జపాన్ అణువిద్యుత్ ప్రమాదం తరువాత ఇకముందు అణువిద్యుత్ కేంద్రాలు నిర్మించవద్దని నిర్ణయించుకున్నారు. వారు మూసేసిన వాటిని మనం తెచ్చుకొని వినాశనాన్ని తెచ్చుకుంటున్నాము. సరికాదని చెప్పారు.

ఈనాడు పారిశ్రామికరణలో అందరికి ఉపాధి సాధ్యమా? ఈనాడు 30 కోట్ల రూపాయల పెట్టుబడికి ఒక ఉద్యోగం వస్తుందని నోబెల్ శాస్త్రవేత్తలు శలవిస్తున్నారు. ఈరీతిన మన ఇంజనీరింగ్ కాలేజీల నుండి పట్టబద్ధులైనవారికి రేపు ఉద్యోగాలు ఎక్కడినుండి వస్తాయి. అన్ని కోట్ల రూ॥ల పెట్టుబడి సాధ్యమా. మనకు కావల్సిన సాంకేతిక పరిజ్ఞానం ఎక్కువ మందికి ఉపాధి లభించే విధానం కావాలి. అందరికి పని కల్పించాలి. విద్యుత్ అవసరమయ్యే ఉత్పత్తులు ఐరన్‌బాక్స్, గీజర్లు, విద్యుత్ ఆధారమైన ఉత్పత్తులు కాకుండా విద్యుత్ అవసరాలు తగ్గించుకోవాలి. మన సుఖాలకోసం అణువిద్యుత్ దిగుమతి చేస్తే జపాన్‌లో పుకుషిమా, అమెరికాలో త్రీమైల్ ఐలండ్, రష్యాలో చెర్నోబిల్ లాంటి మానవ తప్పిదాలు జరగవని గ్యారంటీ ఇవ్వగలమా? ప్రమాదం జరిగితే నివారణ చర్యలు తీసుకునే పరిస్థితి వుందా! తినే తిండి, పీల్చేగాలి, నివసించే ఇల్లు, పొలాలు అన్ని వదిలి కాందిశీకుల్లా వేరే ప్రాంతాలకు తరలిపోవాలి. మనకున్న పరిమిత వనరులు, అపారమైన మానవ వనరులు ఉపయోగంలోకి తెచ్చేందుకు పథకాలు రచించాలి. ఆవైపు అందరూ కలిసి నడవాలి అన్నారు. వివిధ వృత్తులు చేసే వారి నమూనాలను చిత్రాలుగా రూపొందించిన ప్రముఖ ఆర్టిస్ట్ వానపల్లి నరసింహారావు పొటోలను, సోంపేట ప్రజల పోరాటాన్ని వారిపై పోలీసుల దౌష్ట్యాన్ని ఫోటో ఎగ్జిబిషన్‌ను సదస్సు ఆవరణంలో రెండు రోజులు ప్రతినిధులు సందర్శించారు.

రెండు రోజుల సదస్సు ముగింపు సభలో మాచర్ల మోహనరావు ప్రవేశపెట్టిన ఈ కింది తీర్మానాలను సభ చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించింది.








1. లోకవిద్య ఆధారిత వృత్తులు చేసే హక్కు ప్రతీ మానవుడికి వుండాలని, దీనిని భారత రాజ్యాంగంలో ప్రాథమిక హక్కుగా చేర్చాలని తీర్మానించడం జరిగింది.
2. లోకవిద్య ఆధారిత వృత్తులలో వుండే ప్రతీ ఒక్కరికి ప్రభుత్వ చట్టాల ప్రకారం కనీసం వేతనం చెల్లించే బాధ్యత ప్రాథమిక హక్కుగా రాజ్యంగంలో పొందుపర్చాలని తీర్మానించడం జరిగింది.
3. స్థానిక వస్తువులు, ఉత్పత్తులు పూర్తిగా వినియోగమయ్యే దాకా, స్థానికేతర వస్తువులు, సాంకేతిక పరిజ్ఞానం, దిగుమతి చెయ్యరాదని, దీనిపై స్థానిక ప్రజాప్రతినిధులతో కూడిన పంచాయితీ ఆధ్వర్యంలో నిర్ణయించాలని, వస్తువుల ఎగుమతి, దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం పెత్తనం రద్దు కావాలని ఆ అధికారం స్థానిక పంచాయితీలకే చెందాలని తీర్మానించడం జరిగింది.
4. లోకవిద్య ఆధారిత వస్తు ఉత్పత్తులకు సరసమైన ధరలు చెల్లించి విశాల భారత ప్రజానీకం కొనడం ద్వారానే స్థానిక వృత్తికారులు రైతులు, కూలీల ఆర్థిక పరిపుష్టిత, ఆత్మగౌరవం పెంపొందించుకునే దిశగా ప్రజలు ఉద్యమించాలని తీర్మానించడం జరిగింది.
5. పారిశ్రామిక వస్తువుల ధరలు నిర్ణయంలో అదనపు ఖర్చులు చెల్లించినట్లుగా వ్యవసాయ ఉత్పత్తులు స్థానిక సంస్థల ఉత్పత్తుల ధరల నిర్ణయంలో అదనపు ఖర్చులు కలపాలని, మేధావులు సమాంతర ధరల నిర్ణయాలను శాస్త్రీయంగా ప్రకటించి ప్రచారం చేయాలని సదస్సు ఏకగ్రీవంగా తీర్మానించింది.
6. తమిళనాడులో కూడంకుళంలో ప్రారంభిస్తున్న అణువిద్యుత్ కర్మాగారాన్ని బేషరతుగా విరమించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. అంతేగాక తమిళనాడు కూడంకుళం ప్రజల పోరాటాలకు ఈ సదస్సు పూర్తి సంఘీభావం ప్రకటిస్తున్నది.

**- లోకవిద్య ప్రతినిధి -చీరాల**

# పర్యావరణం - ప్రగతి

బ్రతుకు పోరాటంలో సంఘటితమై స్వతంత్రంగా ఉద్యమిస్తున్న ప్రజలు తమ స్వార్థ ప్రయోజనాలకు అడ్డుగోడలుగా మారడం సహించలేని బడా పెట్టుబడిదారులూ, వారి తొత్తులూ వివిధ ప్రచార సాధనాల ద్వారా ఆ ప్రజా పర్యావరణ ఉద్యమాలను కించపరచి అపకీర్తి పాలుచేసే కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా వివిధ దిన పత్రికలలో పర్యావరణ వాదులు పారిశ్రామిక ప్రగతిని నిరోధిస్తున్నారని వారి అనుయాయుల పేర్లతో తప్పుడు వ్యాసాలు రాయడం ఎత్తుగడ. యిప్పటి వరకూ దాదాపు అన్ని తెలుగు దిన పత్రికలలోనూ ఒకే తరహా అభియోగాలతో యిలాటి వ్యాసాలు వచ్చాయి.

సంపద పెరుగుదలే ప్రగతిగా భావించడంలోనే పర్యావరణంతో వైరుధ్యం వుంది. సుస్థిర భవిత కోసం ప్రగతిని పునర్నిర్వచించాల్సిన అవసరం వుంది. ప్రజలందరూ తిండీ, బట్టా, గూడూ, విద్యా కలిగి గౌరవ ప్రదంగా, స్వేచ్ఛగా ప్రకృతి సమతుల్యత చెడగొట్టకుండా బ్రతక గలగడమే ప్రగతి. కాని ప్రస్తుత పారిశ్రామిక సమాజం సంపదంతా కొందరికే చేరే ఆర్థిక వ్యవస్థ క్రింద నడుస్తున్నది. డిసెంబరు 2011లో అసోసియేటెడ్ ప్రెస్ విడుదలచేసిన సమాచారం ప్రకారం అమెరికాలో ప్రతి యిద్దరిలో ఒకరు దారిద్ర్య రేఖకు దిగువన గానీ, స్వల్ప ఆదాయ వర్గంలోగానీ వున్నారు. అది సెన్సస్ బ్యూరో లెక్కల ఆధారంగా ఇచ్చిన సమాచారం. తీవ్ర అసమానత ఈ నాడు అతి సంపన్న దేశమైన అమెరికాలో మేము 99% అనే నినాదంతో 'ఆక్రమణ' ఉద్యమానికి కారణమైంది. ఆసమాజంలో నిరుద్యోగమూ తీవ్రంగా వుంది. అధికారిక లెక్కలప్రకారమే 9శాతం పైన వుంటే, అనధికారిక సమాచారం ప్రతి ఆరుగురిలో ఒకరు నిరుద్యోగని. మూడు వందల ఏళ్ళ నిరంతర ప్రగతి ఫలితం అధిక సంఖ్యాకులకు చేరనపుడు అదే బాటలో ప్రగతిని సాధించబూనడం అవివేకంకాక మరేమిటి? మనదేశంలో ఆర్థిక సరళీకరణ విధానాలు అమలులో వున్న 1990-2009 మధ్యకాలంలో 98 వర్ధమాన దేశాల సామాజిక ఆర్థిక అసమానతల స్థితిపై అధ్యయనం చేసిన దీపాంకర్ బసు, సరళీకరణకు ప్రాముఖ్యత నిచ్చిన దేశాలలో సామాజిక ఆర్థిక అసమానతలు పెరిగాయని గుర్తించారు. మన సరిహద్దు దేశాలతో పోలిస్తే మన దేశంలో అసమానత అత్యధికంగా పెరిగింది. ఈ కాలంలో మానవాభివృద్ధి సూచిక దిగజారుతూ 123 (1991) నుండి 134(2011) కి చేరింది. నిజమైన ప్రగతికీ పర్యావరణానికీ వైరుధ్యం లేదు. కేవలం రెండు విద్యుత్తు ప్రాజెక్టులు అనుకున్న చోట కట్టలేక పోవడం ప్రగతికి తూటు కాదు. ప్రతిపాదనల తిరస్కరణ, ఆర్థిక కారణాలతో ప్రాజెక్టులను అర్ధాంతరంగా ఆపివేయడం సాధారణంగా జరిగేవే. కృష్ణపట్నంలో అన్ని అనుమతులూ పొందిన 4000 మెగావాట్ల ప్లాంటు నిర్మాణాన్ని రిలయన్స్ బొగ్గు ధర పెరిగిందని ఆపేసింది. ఎవరూ అడ్డు రాలేదు. ప్రజలు మాత్రం త్యాగాలు చేయాలి. కంపెనీలకు లాభం మాత్రమే ప్రధానం జనహితం కాదు. అత్యధికులకు ప్రయోజనకరమైన సరైన ప్రగతి మార్గాన్ని గుర్తించి అటుగా అడుగులు వేయాలిగాని, విఫలమైన ఆర్థిక విధానాలను నెత్తినెత్తుకుని అదే ముక్తి మార్గమనీ, వ్యతిరేకించిన వారు ప్రగతి నిరోధకులని నిందించడం కుహనా సంస్కారం.

విద్యుత్తు అవసరం లేదనీ, పారిశ్రామీకరణ వద్దనీ పర్యావరణ వాదులెవ్వరూ అనడంలేదు. భూమిపై ప్రాణికోటి మనుగడని ప్రశ్నార్థకం చేస్తున్న బొగ్గుతో విద్యుత్‌నీ, పర్యావరణ చట్టాలకు తూట్లు పొడుస్తున్న పారిశ్రామీకరణను మాత్రమే వ్యతిరేకిస్తున్నారు. పర్యావరణాన్ని విస్మరించే ప్రగతి ప్రమాదకరం. భూమిపై ఆవరించిన జీవావరణం జీవ ప్రదాత. మానవ మేధకు అందిన మేరలో యింతటి ఉత్కృష్ట జీవులూ, జీవ వైవిధ్యమూ ఎక్కడా లేదు. కాని పారిశ్రామిక విప్లవం మొదలైన తరువాత మూడు శతాబ్దాలలోనే కనీ వినీ ఎరుగని విధ్వంసం జరిగింది. భూమి బండరాయి కాదు. కోట్లాది జీవులతో సజీవం. జేమ్స్ లౌలాక్ అనే శాస్త్రవేత్త భూమిని జీవిగా గుర్తించిగ్రీకు దేవత పేరుతో 'గైయా' అంటూ, జీవులు సమిష్టిగా పర్యావరణాన్ని సమతుల్యతతో ఉంచడాన్ని విశ్లేషించి సిద్ధాంతీకరించాడు. యీనాడు మానవుల ప్రగతి కాంక్ష ఆ సమతుల్యతని ప్రమాదంలో పడేసింది. యిది గమనించి ఆందోళన చెందిన కొందరు శాస్త్రవేత్తలు, మానవులెంచుకున్న ప్రగతి మార్గం 'గ్రహ హద్దులు' మీరే స్థితికి తెచ్చిందని తమ అధ్యయనాల ద్వారా గుర్తించి, ప్రపంచానికి తెలియజెప్పారు. వారి ఫలితాలు జీవ వైవిధ్యం, వాతావరణ మార్పు, నత్రజని వలయం, భూవ్యవస్థలో మార్పు, మంచినీటి వాడుక, రసాయన కాలుష్యం, వాతావరణంలో ఎయిరోసాల్స్, సముద్రాల ఆమ్లీకరణ, ఓజోను తరుగుదల అనే పది వ్యవస్థలు హద్దులలో వుంటేనే జీవుల మనుగడ సుస్థిరమని తెలుపుతున్నాయి. ఈ పదీ దేనికది స్వతంత్రం కాదు. యంత్ర భాగాలను విడివిడిగా బాగు చేసినట్లు ఒక్కో హద్దునీ విడిగా సరిచేయడం సాధ్యంకాదు. అవన్నీ క్లిష్టమైన అంతర్‌సంబంధాలతో పెనవేసుకుని వుంటాయి. ఇప్పటికే మొదటి మూడిటి హద్దులూ దాటేశాం. ప్రమాదపు అంచులో వున్నాం.

బొగ్గుతో విద్యుత్తుని ప్రపంచ వ్యాప్తంగా శాస్త్రవేత్తలూ, పర్యావరణ వాదులు, ప్రజలూ వ్యతిరేకిస్తున్నారు. నిన్న మొన్నటి కోపెన్‌హాగెన్, కాన్‌కున్‌ల నుండి నేటి డర్బన్ వరకూ భూతాపాన్ని నిరోధించే అంతర్జాతీయ ప్రయత్నం కర్బన ఉద్గారాలను తగ్గించే ఒప్పందానికే. బొగ్గుతో విద్యుత్తు అత్యధిక ఉద్గారాలకు కారణమన్నది తిరుగులేని సత్యం. కేవలం పెద్ద మొత్తంలో గృహ హరిత వాయువులను విడుదలచేయడమే కాదు, అత్యంత విషపూరిత కాలుష్యాన్ని వెదజల్లుతాయి ఈ ప్లాంట్లు. ప్రముఖ శాస్త్రవేత్త జేమ్స్ హాన్సెన్ వీటిని మరణాగారాలన్నాడు. అమెరికాలో అధికారికంగా జరిగిన అధ్యయనాలలో ప్రతి ఏటా బొగ్గుతో విద్యుత్ ప్లాంట్ల పరిసరాల్లో నివసిస్తున్న 24,000 మంది వీటి కాలుష్యం వల్ల అదనంగా మరణిస్తున్నారని నిర్ధారించారు. ప్రజారోగ్యంపై 6200 కోట్ల డాలర్ల అదనపు భారం పడుతున్నదని ఆదేశ జాతీయ సైన్సు అకాడమీలు అంచనా వేశాయి. మన రాష్ట్రంలోని పరవాడ పరిసర గ్రామాల ప్రజల యిక్కట్లు తెలియనివి కావు. ఈ మధ్యనే నవంబరు 6న 'ద హిందు' దినపత్రికలో రాసిన సుదీర్ఘ వ్యాసంలో ప్రతి 1000 మెగావాట్ల ప్లాంటు కాలుష్యం సాలుకి 362 మంది మరణానికి హేతువన్నారు మన మాజీ రాష్ట్రపతి డా. అబ్దుల్ కలాం. ఎన్‌సిసి, ఈస్ట్‌కోస్ట్ ప్రతిపాదనలు మొత్తం 5280 మెగావాట్లు. అంటే అవి ఏటా 1911 మందికి మరణ శాసనం. యీప్లాంట్లని ప్రగతిగా చూసే వ్యాసకర్తలు ఆ గణాంకాల్లో భాగమవడానికి సిద్ధమా? ఎవరి ప్రగతికి ఎవరు సమిధలు కావాలి? అందుకే దాదాపుగా బొగ్గుతో విద్యుత్తుకి వ్యతిరేక ఉద్యమం లేని దేశం లేదు. ప్రస్తుతం తూర్పు చైనాలోని హైమెన్ పట్టణంలో వున్న ప్లాంటుతో సతమతమౌతున్న ప్రజలు వేల సంఖ్యలో రెండో ప్లాంటు ప్రతిపాదనకు వ్యతిరేకంగా నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. ప్రగతికి తూట్లు వ్యాసంపైననే చైనాలోని వుకాన్ గ్రామ ప్రజల తిరుగుబాటుపై వ్యాసం వుంది. సంపన్న, అభివృద్ధి చెందుతున్న దేశాలన్నిటిలోనూ ప్రజలు ఈ ప్రాజెక్టులను తిరస్కరించి ఆపడంలో విజయం సాధించిన ఘటనలెన్నో. ఈ మధ్యనే ఐఎమ్ఎఫ్ ముఖ్య అధికారి క్రిస్టీన్ లగార్డె మన దేశంలో బొగ్గుతో కాలుష్యం వల్ల ఏటా 70 వేల మంది చనిపోతున్నారని ప్రకటించారు.

సోంపేట, కాకరాపల్లి లలో జీవ వైవిధ్యానికి నెలవులైన చిత్తడినేలలలో, ప్రభుత్వాధికారుల కుమ్మక్కుతో బంజరు భూములనే రికార్డులు సృష్టించి, యీ తప్పుడు సమాచారం ఆధారంగా అతి కాలుష్య కారకమైన బొగ్గుతో విద్యుదుత్పత్తి చేసే ప్రాజెక్టులకు అనుమతి పొందారు. అంతర్జాతీయ పర్యావరణ ఒప్పందాలని గౌరవించే ఏ దేశమూ చిత్తడినేలలలో పరిశ్రమ స్థాపనకు అనుమతినియ్యదు. సోంపేట విషయంలో ఎన్‌ఇఎఎ పర్యావరణ అనుమతిని రద్దు చేసింది. బాధ్యతతో వ్యవహరించే ఏ కంపెనీ స్థల ఎంపికలో యిలాంటి తప్పుడు నిర్ణయాలు చేయదు. రాజకీయుల అండదండతో ఏంచేసినా చెల్లుతుందనే అహంకారంతో కంపెనీలు వ్యవహరించడం వల్లనే ప్రజలు ప్రాణాలకు తెగించి తమ జీవన భద్రతకై పోరాడారు. ఎన్‌సిసి వివాదాస్పద స్థలంలో పూర్తి అనుమతులు లేకనే వేలమంది పోలీసులు, గూండాల మద్ధతుతో నిర్మాణానికి శంఖుస్థాపన చేయడానికి ప్రయత్నిస్తున్నపుడు ప్రజలు నిరసించారన్నది రాష్ట్ర ప్రజలందరికీ తెలిసిన నిజం. దానిని వక్రీకరించి ప్రజలను అసాంఘిక శక్తులుగా చిత్రిస్తున్నారు. ప్రజాభిప్రాయాలకు విలువనివ్వని ప్రభుత్వాలే నిరసనలను రాజ్యహింసతో అణచే ప్రయత్నం చేస్తాయి. ఎన్‌సిసి బ్లూ రిబ్బన్లు కట్టి వందలమంది గూండాలతో ప్రజలపై దాడి చేసి కొట్టించిన వీడియో సాక్ష్యాలుండగా, ఆగూండాలను తెచ్చి పర్యవేక్షించిన ఎన్‌సిసి కాంట్రాక్టర్ టివిల ముందు ప్రజలను విషసర్పాలుగా చిత్రించడం రాష్ట్ర ప్రజలు చూసినదే కాగా, వ్యతిరేకించిన ప్రజలను అసాంఘిక శక్తులుగా చిత్రించడం దుర్మార్గం. కంపెనీలను బాధితులుగానూ, ఆయా గ్రామప్రజలను భూస్వాములూ, బూర్జువాలుగానూ చూపుతున్నారు. కనీస అవగాహన లేకుండా అడ్డగోలు రాతలకు తెగబడడం నీతిబాహ్యం.

మన దేశంలో పెరుగుతున్న కర్బన ఉద్గారాలకు ప్రధాన కారణం బొగ్గుతో విద్యుత్తు. ఉద్గారాల స్థాయిలో ప్రపంచంలో మూడో స్థానంలో వున్నాం. భూతాపం విపత్తు ప్రత్యక్షంగా అనుభవిస్తున్నా సరళ ఆర్థిక విధానాలను, ప్రైవేటీకరణను ప్రగతికి సోపానంగా భావిస్తున్న ప్రభుత్వంలో భాగమైన పర్యావరణ మంత్రిత్వ శాఖ యిప్పటికి దేశంలో 1,92,913 మెగావాట్ల బొగ్గుతో విద్యుత్తుకి అనుమతులిచ్చింది. యింకా 5,08,907 మెగావాట్లకు అనుమతుల ప్రక్రియ కొనసాగుతున్నది. మన రాష్ట్రంలో 113 ప్రాజెక్టులకు ప్రతిపాదనలున్నాయి. 500 మెగావాట్ల లోపు ప్రాజెక్టులకు రాష్ట్రంలోనే అనుమతి ఇస్తారు. అన్నీ నిర్మిస్తే ప్రస్తుత ఉత్పత్తి సామర్థ్యానికి ఆరు రెట్లు. యిది ప్రణాళికా సంఘం 2031-32 నాటికి బొగ్గుతో విద్యుదుత్పత్తికి చేసిన ప్రతిపాదనకంటే రెట్టింపు. ప్రణాళికా సంఘం నివేదిక ప్రకారం దేశీయ బొగ్గు వనరులు 45 ఏళ్ళలో ముగిసి పోతాయి. మార్చి 2011 లో టెరిసంస్థ రిపోర్టులో ఈ అంచనా సరికాదు యింకా ముందే బొగ్గు వనరులు ఖాళీ అవుతాయంది. తరువాత మన బిడ్డలు చీకటిలో మగ్గాలి. దీర్ఘకాలిక భద్రతలేని, పునరుత్పత్తి లేని, ప్రమాదకరమైన వనరు ఆధారంగా శక్తిభద్రత బూనడం అవివేకం. నిజమైన ప్రజా ప్రభుత్వాలు యిలాంటి తప్పుడు నిర్ణయాలు చేయవు.

**డా. కె. బాబూరావు**
**ప్రజలు కేంద్రంగా అభివృద్ధి సాధన ఉద్యమం**

# ہندوستان کی عوام اور اسکی گربت ـ حصہ ٤

پچھلے لیکھ میں لوک ودھیا سے آپکو واضع کروانے کی پہَل ہمنے کی تھی . ہندوستانی عوام کی گربت کی وجہ سمجھنے کے لیے اس پر اور روشنی ڈالنا واجب ہوگا.

**لوک ودھیا کیا ہے اور کس ترہ کی ہے ؟**

لوک ودھیا کسی جاتی ، دھرم، یا کسی سماج کے بندھن نہیں مانتی، ٹھیک کسی بھاشا کی ترہ. لوک ودھیا کو اگر ہم صرف ہنر کے روپ میں دیکھینگے تو یہ بہت سیمت نظر ایگی اور تب یہ جاتی، دھرم ، وگیرہ میں باندھی معلوم پڑیگی، جو یہ نہیں ہے. لوک ودھیا کو اگر گیان کے روپ میں دیکھینگے اور کسی کسان، کاریگر یا آدیواسی کے کام کرنے کے ترکوں کو باریکی سے پرکھینگے تو آپ پینگے کہ لوک ودھیا صرف ہنر ہی نہیں ، بلکی ایک ایسا گیان ہے جسمے ترک کا ایک پُر یقین پرکار ہے اور اسکے اپنے انکنے اور جانچنے کے ترکے ہیں. ایسا کہیں کی لوک ودھیا میں اس پورے وِشو کو دیکھنے اور سمجھنے کا اپنا ڈنگ ہے جو مگربی نظریے سے الگ ہے. جس یرہ سے ایک پرانت کے لوگ اپس میں وچار ویوہار کا ادان پردان کسی ایک بھاشا میں کرتے ہیں جسے وہاں کے سبھی لوگ چاہے جس دھرم، جاتی یا ویوسہ کے ہوں، جانتے ہیں. اسی ترہ لوک ودھیا ویوصہ، جاتی ، دھرم کے بندھن نہیں مانتی کیونکیہ لوک ودھیا کے ترک اور نظریے پرانت کے سبھی لوگوں کے جیون، وچار، ویوہار کا ادھار ہوتے ہیں. ایسی دنیایی سمجہ اور اسے جڑے مولیوں پر جس لوک ودھیا کا ادھار ہے انکے بنا یہ لوگ جی نہیں سکتے. مطلب یہ کہ جاتی، دھرم، ویوسہ میں بٹی عوام میں جو یکتا کا ستر ہے، وہ انکے گیاں میں بسے ترک اور اسے جڑے مولیوں میں ہے ، نہ کی متر ہنر میں.

**کیا لوک ودھیا پرنتوں کی سرحدوں میں باندھی ہے ؟**

نہیں، یہ بات نہیں ہے. لوک ودھیا جگہ اور وقت کے تحت اپنے آپ کو الگ الگ پراکاروں میں عبارتی تو ہے لیکن اسکے مولہ ، ترک اور ادھار کے پرکار ایک سے رہتے ہیں. جیسی کرناٹک کی لوک ودھیا کیرل یا اندھرا پردیش ادی سے روپ میں بہت الگ ہے، لیکن اسمے بسے ترک اور مولہ کے پرکار ایک سے ہی ہیں. علاقانی لوک ودھیا کے بیچ اکتا کا بہی پرکار ہے.

**لوک ودھیا کا ترک کیا ہے؟**

لوک ودھیا کا طرق سمجہ کے مولیوں، وقت وقت کی ضرورتوں، کچھ الگ کرنے کے تمّنا، ادی سے اپنے کوالگ نہیں رکھتا. ایک ترہ سے لوک ودھیا میں طرق طرق وہی سہی ہے جو لوکسمّت ہے. اسے ہم لوک ویدھیدھر سمجہ میں ہوتے کاموں میں دیکھ سکتےہیں.

اگر کسی کسان سے اسکے کھیت کی مٹی کے بارے میں پوچھا جائے تو وہ یہ بتا سکتا ہے کہ پانی کے ساتھ اس مٹی کا ویوہار کیسا ہے، کون کون سی فصلیں اسمیں اچّھی ہونگی، کیسی خاد اسمیں ڈالنی چاہیے، کیسی نہیں، جیوون پر اسکا کیا اثر ہوگا ، عوام کے لیے ابھی اور آنے والے وقت میں کتنا فایدہ یا نکسن ہوگا، وگیرہ، وگیرہ. اسکی سمجہ اور طرق کے پرکار میں کونی کھوکھلاپن نہیں ہے کیونکیہ موسم، وسیلہ، بازار یا خود اس مٹی میں ہونے والے بدلاوون کے متبیک وہ کھیتی کے تریکوں میں ضروری بدلاؤ بھی لاتا ہے.

اپنے ہر کام سے ہونے والے کسی بھی ترہ کا پرکرتی اور سماجھ پے اثر کا خیال کرتے ہواے اپنے تریکوں میں سدھار بھی لاتا ہے . کچھ ایسا ہی تجربا ہوتا ہے جب کسی آدیواسی سے جنگل کی پیڈ پتیوں، ندی، پربت اور جیوون کے بارے میں پوچھا جائے. وہ اپنی سمجہ کا ادھار انکے لوک کلیانی گنوں سے شرو کرتا ہے اور انکے ساتھ سمبندھ کو مضبوط کرنے والی کریا کا جیکر بھی کرتا ہے. کاریگروں کے ساتھ بات چیت سے بھی یہی ابر کر آتا ہے. دوسرے شبدوں میں کہیں تو یہ اس ترہ سے رکھ سکتے ہیں کی لوک ودھیا میں کسی بھی وستو کی سمجہ کا تریکا اور وستوں کے ساتھ لوگوں کے ساتھ ، پوری دنیا کے ساتھ اس وستو کے سمبھندوں کے معرفت ہوتا ہے. یہ سمجہ نرجیو نہیں ہوتی ، بلکی سماجیک مولیوں اور لوکہت کے ساتھ ایک کسم کی اکتا میں رہتی ہے. طرق کی یہ ودھیا لوکودھیدھر سماج کے سبھی جاتی ، دھرم ، اور سمپرادھیوں میں سماں روپ میں ملتی ہے. مول بات یہ ہے کہ لوک ودھیا میں طرق ، مولہ اور ہنر کو الگ الگ کرکے نہیں دیکھا یا سمجھا جاتا. وے ایک دوسرے میں اس ترہ گول گئے ہوتے ہیں کہ انھیں الگ کرنے میں لوک ودھیا کی آتما ہی نسٹ ہو جاتی ہے. کچھ لوگ لوک ودھیا سے لیس سماج کے ہنر کو الگ کر انکی کابلیت اور انکے علم کو بڑھانا چاہتے ہیں اور ایسے پریاس کئے جا رہے ہیں. انمیں سے کچھ لوگ سفل بھی ہواے ہیں. اکثر شکایت بھی کرتے ہیں کی لوکودھیدھر سماج انکے سجاے گئے سدھاروں نہیں اپناتے. کن وضاحتوں سے ایسا ہو رہا ہے اس پر گور نہیں کرتے. لیکھ زاری رہیگا .

జ్ఞానం సమాజంలోనుంచే ఉద్భవిస్తుంది.

విద్య అంటే సమాజంలో అసమానతలను తొలగించేది.

జ్ఞానం మానవుడు సంపూర్ణ మానవుడవటానికి దోహదపడాలి.

జ్ఞానం మానవుడు సంపూర్ణ మానవుడవటానికి దోహదపడాలి.

జ్ఞానం లాభాపేక్ష కోసం పరిశ్రమ కారాదు

జ్ఞానం మానవుడు సంపూర్ణ మానవుడవటానికి దోహదపడాలి.

వ్యక్తిత్వ వికాసానికి సమాజంలో అందరికి ఉపయోగపడేది జ్ఞానం.

అన్ని రకాల విద్యలు, వృత్తులు సమానమే

**"లోకవిద్య ప్రపంచం" చదవండి, చదివించండి, చందాదారులుగా చేరండి**

దీనిలోని వ్యాసాలు యథాతథంగా ఎవరైనా, ఎక్కడైనా ప్రచురించటానికి హక్కులు అందరివి.

వ్యాసాలు, ఉద్యమ వార్తలు పంపించవలసిన చిరునామా :
Loka Vidya Prapancham
D.No. 10-100, New Gaddiannaram, Hyderabad - 500 060. Ph : 040-24152155
e-mail : tnrkoundinyasa@yahoo.com

**BOOK - POST PRINTED MATTER**
**JUNE 2012**

**To**

Printed, Edited & Published by T. Narayana Rao B.Com., LL.B. D.No. 10-100, New Gaddiannaram, Hyderabad - 500 060.